# ప్రయాణం

— చంద్ర



**లలిత** అసహనంగా వాచీ వైపు, పట్టాల వైపు, సిగ్నల్ వైపు మార్చి, మార్చి చూస్తోంది. రైలు ఈ పాటికే రావలసింది.

చంకలోని పాప కుదురుగా కూర్చోక, బలంగా లలితను కుదిపేస్తుంది. లలిత చంటిదాని వీపు మీద ఒకటి అంటించింది. సూట్‌కేస్‌ని దఢాల్న కింద పడేసి, దానిమీద కూర్చో బెట్టింది. హ్యాండ్ బ్యాగు లోంచి చాక్‌లెట్ తీసి, వెక్కుతోన్న పాప చేతి కిచ్చింది.

లలిత విసుగ్గా మరోసారి ప్లాట్‌ఫాం ఈ చివరి నుండి ఆ చివరకి దృష్టి సారించింది. ఎవరి హడావుడిలో వాళ్ళున్నారు.

సామాను వంక చూసే సరికి లలిత గుండె బేజారయింది.

రైలు పట్టుమని పదినిమిషాలు ఆగుతుందో? లేదో? వీటన్నిటిని ఒంటరిగా లోపలికి ఎలా చేర్పించడం? ఆయనగారు రిజర్వేషన్ చేయించడంతోనే ఘనకార్యం పూర్తయినట్లు కాలరెగరేసారు. కనీసం స్టేషన్ కయినా రావాలను కోలేదు." లలితకు విశ్వం మీద కోపం ముంచుకొచ్చింది.

ఈ సామాన్లు కొనడం కోసం పొద్దుటి నుంచి పడిన హడావుడి ఓ ఎత్తైతే, మాటామంతీ లేకుండా ఒంటరిగా స్టేషన్‌లో పడివుండడం మరో ఎత్తు.

'నిశ్చితార్థానికే ఇంత సామాను ఇక్కడి నుంచి చేరేయాల్సి వస్తూంటే, ఇక పెళ్ళి నాటికి....?'

"యువర్ అటెన్షన్ ప్లీజ్..." లలిత ఆలోచల్ని ఆపేస్తూ, అనౌన్స్ మెంట్ ఆలకించింది.

చార్మినార్ ఎక్స్‌ప్రెస్ వేగంగా వచ్చి ఆగింది. ఒక్కసారిగా ప్లాట్‌ఫాం మీద కలకలం మొదలయింది.

లలిత ముందే కుదుర్చుకున్న కూలీ, అట్ట పెట్టెల్ని నెత్తిన పెట్టుకొని దాదాపు పరిగెత్తుతున్నట్లుగా ముందుకెళ్ళాడు.

లలిత ఇంకో కూలీ దొరుకుతాడేమోనని చూసింది. ఇంతలో అనౌన్స్‌మెంట్ మొదలయింది.

లలిత చంకలో పాపని ఇరికించుకొని, ఎయిర్ బ్యాగ్‌ని ఓ భుజానికి, హ్యాండ్ బ్యాగ్‌ను మరోదానికి తగిలించుకొంది. సూట్‌కేస్‌ను చేతిలోకి తీసుకొని, బోగీ నంబర్ చూస్తూ ముందుకు పరిగెత్తింది.

పాప బిత్తరపోయి ఏడుపు లంకించుకొంది. కాళ్ళతో పొట్ట మీద, నడుం మీద తన్నడం మొదలు పెట్టింది. లలిత ఇవేవీ పట్టించుకోకుండా, రైలు కదులుతుందేమో నన్న ఆరాటంతో వేగంగా పరుగులు తీసింది.

తీరా అక్కడికి వెళ్ళే సరికి, రైలులోకి ఎక్కగలనన్న ఆశ అడుగంటింది. ఎక్కేవాళ్ళు ఓ పక్క ఎక్కుతుంటే, వాళ్ళను ఎక్కించే వాళ్ళ సందడి మరోపక్క వేళాకోళాలు, అప్పగింతలు, కంటితుడుపులు, చిరునవ్వుల మధ్య వీళ్ళు ఎక్కడం లేదు, వాళ్ళు ఎక్కించడం లేదు.

ఆ గజిబిజి గందరగోళంలోనే ఎవరో లలిత చేతిలోని సామానును లోపలికి చేర్చారు. అలాగే తనకు తెలియకుండానే లలిత లోపలికి వచ్చి పడింది. కదులుతోన్న రైలు కిటికీలోంచి కూలీకి డబ్బులు దాదాపు విసిరేసినట్లుగా అందించింది.

రిజర్వేషన్ కంపార్ట్‌మెంట్ అవడంతో ప్రయాణీకులు సీట్లకి సరిగ్గా సరిపోయారు. లలిత పాపని తన బెర్త్ మీద కూర్చోబెట్టింది. అక్కడక్కడికి చేరిన సామానును సీటు కిందికి సర్దింది. వాటర్ బ్యాగ్‌ను హుక్‌కు తగిలించింది. పాపని వళ్ళోకి తీసుకొని, కిటికి దగ్గర కూర్చుంది. రైలు వేగం పుంజుకోవడంతో హాయిగా గాలి పీల్చుకొంది.

లలిత దృష్టి ఎదుటి సీటు మీద పడింది. లలిత గుండె గుభిల్లంది.

నిలకడలేని చూపు, కొద్దిగా తెరుచుకొని వున్న నోరు, జారిన కింది పెదవి, పెదవిని నెడుతున్నట్లున్న నాలుక, తలను మెల్లిగా అటు ఇటు ఆడిస్తూ లలితనే చూస్తున్నాడో ఇరవై ఏళ్ళ అబ్బాయి. బాసింపట్టు వేసుకుని, వళ్ళో నీళ్ళ సీసా పెట్టుక్కూర్చున్నాడు. లేత నీలం రంగు పైజామా, జుబ్బా వేసుకొని వున్నాడు.

లలిత చూపు తన మీద పడగానే "హ్హె హ్హె" అంటూ చప్పట్లు కొడుతూ, గట్టిగా నవ్వాడు.

లలిత గబుక్కున తల తిప్పుకొంది. లలితకు ఎందుకో గానీ చిన్నప్పటి నుంచి ఇలాంటి వాళ్ళంటే చచ్చేంత భయం. అక్కడెక్కడో ఇలాంటి వారొకరున్నారని తెలిస్తే, ఆ చుట్టు పక్కలకి వెళ్ళడానికి సాహసించేది కాదు. అలాంటిది, ఇప్పుడు అతను చేయి చాస్తే అందేంత దూరంలో తను! ఇతనితో కలిసి తెల్లారేదాకా కలిసి ప్రయాణం చేయబోతోంది! లలిత అసహనంగా కదిలింది. కిటికీలోంచి చీకట్లోకి చూస్తూ కూర్చుంది. అక్కడో ఫ్యాక్టరీ ఇక్కడో ఫ్యాక్టరీ కనిపిస్తున్నాయి.

లలిత వళ్ళో కూర్చున్న పాప కిందికి జారింది. లలిత పాపను పట్టుకొని పక్కన కూర్చో బెట్టుకొంది. ఓ చేయి పాప నడుం చుట్టూ వేసి, మరో చేతిని కళ్ళకు అడ్డం పెట్టుకొని, కిటికీకి తలాన్చింది.

"నీ పేలేంతి?" ఎదురుగా కూర్చున్నతను ముద్దముద్దగా అడిగాడు. అతని కంఠం బొంగురుగా, గరగరలాడుతోంది.

"చిత్తి. మలి నీ పేలు?" చిట్టి అతన్ని అనుకరిస్తూ అంది.

"లాజు... హ్హెహ్హె...హ్హెహ్హె" అంటూ పగలబడి నవ్వాడు.

"లాజా?" చిట్టి కూడా అతనితో పాటు అతనిలాగే నవ్వింది. .

కూర్చున్న వాళ్ళందరూ మాటలాపి, వీళ్ళ వైపు చూసారు. లలిత చిట్టిని లాగి, కిటికీ వైపుకు తల తిప్పి కూర్చోపెట్టింది.

లలిత గుండె దడ దడ లాడింది. ఇతనితో ఇలాగే మళ్ళీ మాట్లాడితే,

తన చిన్నారి చిట్టి కూడా తెల్లారేలోగా ఆ మాటలు, చేష్టలు నేర్చుకుంటుందే మోనని అనుమానం వేసింది. ఆ భయంతో లలిత చిట్టిని తల తిప్పనీయ కుండా, గట్టిగా బిగించి పట్టుకొంది.

లలిత చూడకుండా చిట్టి రాజును చూసి ముసిముసి నవ్వులు నవ్వింది. రాజు కూడా సైగలు చేస్తూ, మధ్య మధ్యలో విరగబడి నవ్వుతున్నాడు. గర గరలాడుతోన్న ఆ నవ్వు వింటూంటే లలితకు మహా కంపరంగా వుంది.

"ఎక్స్‌క్యూజ్ మీ"

లలిత తలెత్తి చూసింది.

ఎవరో జులపాల యువకుడు. ఓ చేత్తో మ్యాగజైన్‌ను, మరో చేత్తో వెలుగుతోన్న సిగరెట్‌ను పట్టుకొని, నిలుచుని వున్నాడు. అతని చూపు లలిత పక్క సీటు మీద వుంది.

లలిత తన హ్యాండ్ బ్యాగ్‌ను పక్కకు తీసింది.

"థ్యాంక్ యూ" అతను విలాసంగా అంటూ లలిత పక్కన కూర్చున్నాడు.

రాజు అతనిని చూసి కూడా పలకరింపుగా నవ్వాడు. అతను రాజుని పట్టించుకోలేదు. అతను చేతిలో సిగరెట్‌ను అలాగే పట్టుకొని, మ్యాగజైన్‌ను తిరగేయడం మొదలెట్టాడు.

సిగరెట్ పొగ లలితను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఇబ్బందిగా అటూ ఇటూ కదిలింది. అది ఒయిపోతే బావుండునని దాన్నే చూస్తూ కూర్చుంది. కానీ ఆ జులపాల కుర్రాడు అది పూర్తిగా కాలగానే, మరోటి వెలిగించి చేతిలో పట్టుకున్నాడు.

లలిత తల పట్టుకొని, కిటికీలోంచి బయటకు చూడసాగింది.

"బాబాయ్, బాబాయ్, ఆ అంకులు చేతిలో మండుతోందే, అదేంతి?" రాజు ఆశ్చర్యంగా, ఆ యువకుడిని గమనిస్తూ, తన పక్కనున్న బాబాయి నడిగాడు.

"వీడి మొహానికి సందేహాలొకటి!" లలిత మనసులోనే విసుక్కుంది... రాజు వాళ్ళ బాబాయి ఏం సమాధానం చెప్పాడో వినిపించుకోలేదు. చిట్టి మీద నుంచిఅతని దృష్టి మరలినందుకు, సిగరెట్ మీద ఇందాకటి నుంచీ రగులుతోన్న కోపం కాస్త చల్లారింది.

నిజానికి, చిట్టి కనుచివరల నుండి రాజునే గమనిస్తోంది.

రాజు జులపాల కుర్రాణ్ణి అభినయించి చూపాడు. చిట్టి కిసుక్కున నవ్వింది. రాజు పగలబడి నవ్వాడు.

లలిత చిట్టి నెత్తిన మొట్టికాయ వేసింది. చిట్టి మళ్ళీ కదలకుండా కూర్చుంది. లలిత తలను వెనక్కాన్చి, ఫ్యాను వైపు చూడసాగింది.

చిట్టి లలిత చేయిపట్టి ఊపుతూ అడిగింది, "మమ్మీ డాడీ మనతో కలిసి ఎప్పుడూ రాడెందుకు?"

లలిత సమాధానం చెప్పకుండా నిట్టూర్చింది.

చెల్లెలు గారి నిశ్చితార్థపు సామాన్ల లిస్టు తెగ ఉత్సాహంగా చెప్పిన ఆ పెద్ద మనిషికి, ఆ సామాన్లతో ప్రయాణం చేయాలన్న ఆలోచనే రాలేదు. పై పెచ్చు, 'మీ ఆడాళ్ళతో ప్రయాణం విసుగు బాబూ, ఒక్కరు బయలు దేరారంటే బండెడు సామాను సిద్ధం చేస్తారు." అంటూ స్టేట్ మెంట్ జారీ చేసాడు... ఆ నోటితోనే, "కాస్త నా బట్టలు నీ సూట్‌కేస్‌లో పెట్టుకొని వెళ్ళ రాదూ?" అని పురమాయించాడు. "రెండ్రోజులాగి ఎలాగు వస్తారుగా? కొన్ని సామాన్లు మీరు తీసుకురాకూడదూ?" అంటే ససేమిరా ఒప్పుకోలేదు.

ప్రతి సారీ ప్రయాణానికి ముందు ఈ గొడవ మామూలయిపోయింది. లలిత ముఖం చిట్లించింది.

పక్కనున్న జులపాల యువకుడు మ్యాగజైన్ చదువుతూ, మధ్య మధ్య లో లలితను ఎగాదిగా చూస్తున్నాడు. అతని చేతిలో సిగరెట్ మండుతూనే వుంది.

లలితకు అతని వాలకం చూస్తుంటే, వళ్ళు మండిపోతోంది. నిస్సహాయంగా కిందికి చూస్తూ కూర్చుంది. కాసేపటికి, కళ్ళు లలితకు తెలియకుండానే మూతలు పడ్డాయి.

ఆకస్మాత్తుగా ఎవరో లలిత మోకాళ్ళపైన రెండు చేతులు వేసి, చీరను పట్టి బలంగా లాగుతున్నట్లయింది. లలిత బిత్తరపోయి లేచికూర్చుంది.

రాజు!!

నోరును మరింత కిందికి జారవిడిచి, కళ్లు వెడల్పుచేసి, మొరటుగా లలిత చీరను నలిపేస్తున్నాడు.

లలిత మోకాలితో విసురుగా విదిలించింది.

రాజు వెళ్ళి తన సీట్లో కూలబడ్డాడు.

చుట్టూ వున్నవారు వినోదం చూస్తున్నారు. చిట్టి అయోమయంగా లలితను, రాజును చూస్తోంది.

లలిత తల వంచుకుని, చీరను సరి చేసుకుంది.

రాజు వాళ్ళ బాబాయి కూడా రాజు వింత ప్రవర్తనకు ఆశ్చర్యపోయాడు.

"ఏంట్రా రాజు ఈ పని? తప్పు కాదూ?" అంటూ కేకలేసాడు.

"నేనేం చేసాను? ఆ ఆంతీ చీల మీద సిగలెత్తు పదింది. ఆల్పాను. ఆ ఆంతీ నన్నలా తన్నిందే? నేను ఆంతీతో -కచ్చి!" రాజు భయంకరంగా వెక్కిళ్ళు పెడుతూ అన్నాడు.

అందరి దృష్టి లలిత చీరమీద పడింది. మోకాలి మీదుగా రూపాయి బిళ్ళ మందాన కాలి వుంది. 'కాటన్ చీర కాబట్టి సరిపోయింది. ఇదే సిల్కు చీర అయితేనా? అమ్మో!' లలిత గబుక్కున ఆ చిరుగు మీద అరచేయి అడ్డం పెట్టింది.

దాంతో, అందరూ ఆ జులపాల కుర్రాడి వైపు తిరిగారు. తలా ఓ మాట గబ గబ వదిలేసారు. జులపాల కుర్రాడు తన మ్యాగజైన్‌ను, సిగరెట్‌ను తీసుకొని కంపార్ట్‌మెంట్ తలుపు దగ్గరకి వెళ్ళాడు. తలుపు తీసుకొని, దానికి చేరగిలబడి మళ్ళీ తన పనిలో తాను మునిగిపోయాడు.

ఆ జులపాల కుర్రాడు కావాలని వేసాడో, పొరపాటున వేసాడో కానీ లలితకు అతని మీద కోపం రాలేదు. రాజు అలా మొరటుగా చీరను పట్టి లాగడం లలితకు కోపాన్ని తెప్పించింది. ఇంకాస్త గట్టిగా లాగి వుంటే, చీర కుచ్చిళ్ళు వూడి కిందికి కుప్పగా పడి వుండేది. లలిత కళ్ళు తడిగట్టాయి.

ఇంతలో టి.సి వచ్చాడు. అందరూ టికెట్లు తీసి ఇస్తున్నారు. లలిత మొహం చూసి అతనడిగాడు, "ఏం జరిగింది మేడం? అలా వున్నారు?"

"ఆ... ఏం జరుగుతుందిలెండి? మంచి వాళ్ళతోనే వేగలేక చస్తుంటే, పిచ్చివాళ్ళను వాళ్ళతో కలిసి ప్రయాణం చేయమంటే ఇంతకన్నా ఏం అవుద్ది?" అంటూ ఓ నడివయసాయన పెదవి విరిచాడు.

టి.సి. అయోమయంగా చూసాడు. అతను రాజు వైపు వేలెత్తి చూపాడు.

రాజు వాళ్ళ బాబాయి భుజం మీద తలపెట్టి, వెక్కిళ్ళు పెడుతూనే వున్నాడు. ఆ ఏడుపు రైలు రొదని మించి లలిత మెదడును తొలిచేస్తోంది. కుక్కలు ఏడిచినట్లుగా, నక్కలు ఊళ పెట్టినట్లుగా వుందా ఏడుపు.

లలిత టి.సి.తో ఏదో చెప్పబోయే లోపలే తలా ఓ మాట గబగబ అన్నారు. రాజు వాళ్ళ బాబాయి నిర్లిప్తంగా వింటూ వుండిపోయాడు. అతను రాజును సముదాయిస్తున్నట్లుగా తలను నిమురుతూ వున్నాడు.

"మీ ఇద్దరివీ లోయర్ బెర్త్‌లే. కోపం మనసులో పెట్టుకొని, ఆ పిచ్చోడు పీక పిసకడానికి ప్రయత్నించాడనుకోండి, ఏం చేస్తారు? మా పాటికి మేమం దరం నిద్ర పోతుంటాం. టి.సి. వున్నపుడే సర్దుబాటు చేసుకోండి.' ఈ మాటలు ఎవరన్నారో కానీ లలిత భయం వెన్నులోంచి వళ్ళంతా జర జరా పాకింది.

రాజు తన పాటికి తాను గోల గోలగా రోదిస్తున్నాడు. రాజు వాళ్ళ బాబాయి నెమ్మదిగా అన్నాడు, "చూడండి మేడం. రాజు మీరు భయపడాల్సి నంత చెడ్డవాడేం కాదు. వట్టి అమాయకుడు కాబట్టే మీ చీర కాలుతుంటే చూడలేక చేతులు కాల్చుకున్నాడు. ఇలా చూడండి" అంటూ రాజు అరచేతులు చూపించాడు.

ఎవరూ అటు చూడలేదు. లలిత విసురుగా తలతిప్పుకుంది.

"పోనీ అతన్ని పై బెర్త్‌లో పడుకోమను. నేను లోయర్ బెర్త్ తీసుకుంటాను." నడివయసాయన అన్నాడు.

లలిత అతనికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంది.

"వాడు పై బెర్త్‌లో అయితే నిద్రలో దొర్లి కింద పడతాడనే, దగ్గరుండి లోయర్ బెర్త్ రిజర్వ్ చేయించాను. పసిపిల్లాడి లాంటి వాడు సర్. అతనిపై

మీకు కోపం ఎందుకండీ?"

"కోపమేముందీ? ఉన్నమాటంటే ఉలుకెక్కువని పిచ్చాడిని పిచ్చాడిలా చూస్తే మీకు అంత ఉక్రోషమెందుకు?"

"వాళ్ళా బెర్త్ రిజర్వ్ చేయించుకొన్నారు. తెల్లారేపాటికి ఎక్కడి వాళ్ళక్కడికి వెళ్ళి పోతారు. ఇప్పుడీ గొడవలు ఎందుకండీ? కాజీపేటలో ఇంకో చోట ఏదైనా లోయర్ బెర్త్ అడ్జస్ట్ అవుతుందేమో చూస్తాను." అంటూ టి.సి. ముందుకెళ్ళిపోయాడు.

అందరూ ఈ విషయాల గూర్చే ఓపికున్నంత సేపు చర్చించుకున్నారు. లలితకు ఆ చర్చలన్నీ తన చుట్టూ తిరుగుతున్నాయన్న విషయం తలుచుకుంటేనే చిరాకుగా వుంది. మౌనంగా చిట్టిని చూస్తూ కూర్చుంది.

"మమ్మీ నాకు బిస్కట్ కావాలి." అంది చిట్టి.

"బిస్కట్ మళ్ళీ తిందువుగానీ, చపాతీ తినిపిస్తాను. పడుకోవచ్చు."

లలిత చిట్టికి చపాతి గబగబ తినిపించింది. రాజు నోరు వెడల్పు చేసి వీళ్ళనే చూస్తున్నాడు. లలితకు రాజును చూస్తుంటే కడుపులోంచి తెములు కొస్తోంది. మిగిలిన చపాతిని వుండ చుట్టి బయటకు విసిరేసింది. తను మంచినీళ్ళు మాత్రం తాగింది. మిడిల్ బెర్త్ సరిచేసి, దిండు, దుప్పటి తీసుకొని తన బెర్త్ మీద పడుకుంది. చిట్టిని కళ్ళు మూసుకోమని గదమాయించింది.

"రాజూ, నువ్వు కూడా పడుకుంటావురా?"

"నాకు నువ్వు అయిసు కొనిస్తానన్నావుగా?"

"కొనిస్తాలే గానీ, పడుకో," రాజు వాళ్ళ బాబాయి రాజు పక్క సరిచేసి పడుకో పెట్టాడు. రాజు చిట్టి వంకే చూస్తూ పడుకొన్నాడు.

జులపాల కుర్రాడు లోపలకి రాలేదు. నడివయసాయన లైటార్పి, అతని బెర్త్ పైకెక్కాడు. పై బెర్త్ వాళ్ళు పైకెక్కి కబుర్లు చెప్పుకుంటున్నారు. రాజు వాళ్ళ బాబాయి రాజునే గమనిస్తూ కూర్చున్నాడు.

లలిత మనసు కాస్త శాంతించింది. చిట్టిని జోకొడుతూ ప్రశాతంగా కళ్ళు మూసుకుంది. అరగంట సరిగ్గా పడుకుందో లేదో ఎవరో లలిత నడుం మీద కాలు తగిలిస్తూ కిందికి దిగారు. అటువైపు చిట్టి పడుకొని వుండడంతో, లలిత బెర్త్ చివరి కంటా పడుకోవాల్సి వచ్చింది. లలిత కొంచెం లోపలికి జరిగింది. ఇంతలోనే కాళ్ళను తాకుతూ పైకెక్కారెవరో.

చిట్టిని తీసుకొని గుండెల మీద పడుకో పెట్టుకొని, అటువైపు జరిగింది. కాళ్ళను దుప్పట్లోకి లాక్కుంది. మళ్ళీ ఎవరో లలితను తాకడానికి ప్రయత్నించే సరికి, కావాలనే చేస్తున్నారన్నది అర్థమైంది. లలిత గొంతు పొడారిపోయింది. "ఆ పిచ్చాడు తన పీక పిసక వచ్చని ఆ పెద్దాయన చెప్పాడు కదూ?" లలిత మెల్లిగా తల్కెత్తి రాజువైపు చూసింది. రాజు నోరు తెరుచుకొని నిద్రపోతున్నాడు.

లలిత పై బెర్త్ మీద నుంచి రెండు మొరటు కాళ్ళు కిందకు వేలాడాయి. వాటి మీద వేలాడుతున్న గోధుమ రంగు బిళ్ళగోటు అడ్డపంచను, లలిత గుర్తు పట్టింది. ఆ నడివయసాయన తన కాళ్ళతో లలిత కాళ్ళను తాకటానికి ప్రయత్నిస్తూ కిందికి దిగాడు. లలితకు ఏం చేయాలో పాలుపోలేదు. విశ్వం మీద కోపం ముంచుకొచ్చింది. రెండ్రోజులాగి ఇద్దరూ కలిసి వస్తే ఈ గొడవలు వుండేవి కాదు కదా? బిక్కు బిక్కు మంటూ తెల్లారే దాకా ఎదురు చూడాల్సిందేగా! అటు చూస్తే ఎప్పుడు ఏ ప్రమాదం తలపెడతాడో తెలీని పిచ్చోడు, ఇటు చూస్తే బండెడు సామాను ఎవరు, చేత పట్టుకుపోతారో నన్న దిగులు. పై నుంచి ఇప్పుడిదొకటి!

లలిత దుప్పటిని గొంతుదాకా లాగి రాజుని, మిగిలిన వాళ్ళని మార్చి మార్చి చూస్తూ పడుకుంది. చిట్టి నిద్రలోకి జారుకుంది. లలిత పాపను పక్కన పడుకో పెట్టి, బాత్‌రూంకి వెళ్ళడానికి లేచింది.

లలిత పైకి లేవడం చూసి, బెర్త్ మీంచి తలలు బైటకు పెట్టి అందరూ ఒక్కసారిగా అన్నారు,

"ఏం కావాలండీ?"

"నో... థాంక్స్" లలిత విసురుగా చెప్పి, బాత్‌రూం వైపు నడిచింది. రెండు బాత్‌రూంలలో ఎవరో వుండడంతో లలిత కాసేపు ఆగాల్సి వచ్చింది. జులపాల యువకుడు ఓ తలుపు దగ్గర నుల్చుని, విలాసంగా సిగరెట్ కాలుస్తున్నాడు.

ఇద్దరు యువకులు వచ్చి, మరోవైపు తలుపు తెరుచుకొని, కాజీపేట రావడం కోసం ఎదురు చూస్తున్నారు. నడివయసాయన వారి దగ్గర చేరి, కుళ్ళు జోకులు పేల్చి,. బలవంతంగా నవ్విస్తున్నాడు.

బాత్‌రూం ఖాళీ అవడంతో లలిత వాళ్ళందర్నీ కను చివరల నుండి ఓసారి చూసి లోపలకి వెళ్ళింది. చల్లటి నీళ్ళతో మొహం కడుక్కొంది. తలుపు తీద్దామని ముందుకు వచ్చింది. రైలు కీచుమంటూ ధడాల్న ఆగింది. ఆ వేగానికి లలిత విసురుగా వెళ్ళి వాష్ బేసిన్‌కు కొట్టుకుంది.

లలితకు ఏం జరుగుతున్నదో అర్థం కాలేదు. తమాయించుకుని, తలుపు తీసుకుని బయటకు వచ్చింది.

బోగి తలుపు దగ్గర అందరూ గుమిగూడి వున్నారు. లలిత రెండు బాత్ రూంల మధ్య ఇరుక్కుపోయింది. లలిత మనసులో విలాసంగా సిగరెట్ కాలుస్తోన్న జులపాల యువకుడు, కులాసగా కబుర్లాడుతోన్న యువకులు మెదిలారు. 'పాపం వారికి జరగరానిదేమైనా జరిగివుంటుందా?' లలిత మనసు పరిపరి విధాల పోతోంది. లలితకు చిట్టి జ్ఞాపకం వచ్చింది. 'ఇందాకటి కుదుపుకు చిట్టి కింద పడిందేమో!' లలిత తోసుకుంటూ, దారి చేసుకొని ముందుకు వచ్చింది.

నడివయసాయన లలిత భుజాల చుట్టూ చేయి వేసి, "జరిగిందేదో జరిగింది. బాధ పడమాకండి" అన్నాడు.

లలిత ముందు అతని చేతిని విసిరి కొట్టింది.

"ఏం జరిగింది? అయినా, బాధపడడం దేనికి?" అతను చెప్పే సమాధానం వినిపించుకోకుండా ముందుకు నడిచింది.

"ఏదో అమాయకుడు కాబట్టి అంత సాహసం చేసాడు!"

"అసలు ఆ తలుపు దగ్గర ఎవరో నిల్చునే వున్నారటగా?"

"అవునట!"

"ఎవరూ అతన్ని ఆపడానికి ప్రయత్నించలేదా?"

"ఎవరి గోలలో వాళ్ళున్నట్లున్నారు"

"రైలు ఎవరు ఆపారో?"

"ఏమో మరి? జరగాల్సిందేదో జరిగిపోయాక ఏం చేస్తే మాత్రం లాభం ఏమిటి?" తలాతోకా లేని సహప్రయాణీకుల సంభాషణలు లలితకు అర్థం కావట్లేదు. ఆకస్మాత్తుగా రాజు జ్ఞాపకం వచ్చాడు.

"ఆ రాజు చిట్టిని ఏమైనా చేసివుంటాడా? ఆ పిచ్చి వెధవ తన మీద కోపం పాప మీద చూపాడేమో?"

లలిత ఒక్క ఉదటున తలుపు దగ్గరకి వెళ్ళింది. అందర్నీ నెట్టుకొంటూ, బయటకు తొంగి చూసింది.

రాజు రాళ్ళ గుట్ట మీద వెల్లకిలా పడివున్నాడు. కళ్ళు ఆకాశాన్ని చూస్తున్నాయి. చలనం లేని చేతులు చిట్టిని గుండెలకు అదుముకొని వున్నాయి.

చిట్టి "లాజూ.....లాజూ...." అంటూ రాజుని కుదిపేస్తోంది.

లలిత నిద్రలో నడిచినట్లుగా నడుస్తు వారి దగ్గరకి వచ్చింది.

"ఆ పాపెవరో మమ్మీ అని ఏడుస్తూ తలుపు దగ్గరకి వచ్చిందట. తలుపులు రెండు బార్లా తీసి వున్నాయట. ఈ అబ్బాయి పాప వెళ్ళడం చూసి, వెనకే వెళ్ళి, పాపని కిందకి పడకుండా ఆపడానికి ప్రయత్నించి... పాపం... ఇలా..."

లలిత చెవులు దిబ్బళ్ళు పడ్డాయి. ఎవరి మాటలూ చెవిలో పడడం లేదు. రాజు వాళ్ళ బాబాయి రాజు పక్కన కూర్చుని మౌనంగా రోదిస్తున్నాడు.

రాజు వేలాడే పెదవి, దానిని నెడుతున్నట్లున్న నాలుక లలితకు అతనిపై కలిగిన అనుమానాలని, భయాలని వెక్కిరిస్తున్నట్లుగా వున్నాయి.

ఎందుకనో కానీ రాజు గుండెల మీద నుంచి చిట్టిని ఎవరూ పైకి తీయలేదు.

లలిత కూడా మౌనంగా చూస్తూ వుండి పోయింది.

చిట్టి "లాజూ....లాజూ..." అని పిలుస్తూనే వుంది.

కీచురాళ్ళు కీచుమంటూ రోదిస్తూనే వున్నాయి.